News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక
Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :55 | ఖమ్మం | శుక్రవారం, ఏప్రిల్ 10, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్ పార్టీలోకి



కాంగ్రెస్ మాజీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరారు గురువారం ( ఏప్రిల్ 9 ) జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు జీవన్ రెడ్డి. కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్ తన ఇంటికి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చారని అన్నారు. ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్ లో చేరానని వెల్లడించారు జీవన్ రెడ్డి. తనను పార్టీలోకి ఆహ్వానించినందుకు కేసీఆర్, కేటీఆర్ లకు హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం భావోద్వేగానికి గురి చేసిందని.. ఇవాళ బీఆర్ఎస్ తో కలవడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. గత 20 మాసాలుగా అవమానాలు తట్టుకుని ఓపిక పట్టానని అన్నారు.

ఎందరి ప్రభుత్వాలో చూశాను.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉందని అన్నారు జీవన్ రెడ్డి. ప్రజాభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని..కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి.

# కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని 3 బ్యారేజీలకు మరమ్మతులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి (=వఝుత్ష్ట =వఎఎ) ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆయన సూచించారు. కాళేశ్వరం మరమ్మతులపై నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు సమావేశానికి హాజరయ్యారు. "బ్యారేజీల మరమ్మతులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. వీలైనంత త్వరగా పనులు వేగవంతం చేయాలి. ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలి. ఏజెన్సీలన్నింటినీ అప్రమత్తం చేసి పనుల్లో వేగం పెంచాలి. వర్షాకాలానికి ముందే పరీక్షలు, నమూనాల సేకరణ పూర్తి చేయాలి. సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు,

నీటిపారుదలశాఖ, డిజైన్ కన్సల్టేషన్స్‌తో బృందం ఏర్పాటు చేయాలి. ప్రతి పనిలో సీడబ్ల్యూసీ సభ్యులు ఉండేలా చూడాలి. బ్యారేజీల మరమ్మతులకు సంబంధించి డిజైన్‌లు, డిసెంబర్‌లోపు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలి. నిధుల కొరత రానివ్వం.. పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. పనులు ప్రారంభమయ్యాక స్వయంగా వచ్చి పరిశీలిస్తా"అని సీఎం అన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని జీవన్‌రెడ్డి విమర్శించడం సరికాదు

**జీవన్ రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అసహనం**
**ముఖ్యమంత్రిపై జీవన్ రెడ్డి విమర్శలను తప్పుబట్టిన టీపీసీసీ చీఫ్**
**ఎమ్మెల్యేలందరూ కలిసి ఆయనను సీఎంగా ఎన్నుకున్నారని వెల్లడి**
**బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు భవిష్యత్తులో కలిసిపోతాయని జోస్యం**



కాంగ్రెస్ పార్టీకి కొన్నిరోజుల క్రితం రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిపై ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. ముఖ్యమంత్రిపై విమర్శలు జీవన్ రెడ్డికి సరికాదని అన్నారు. ఎమ్మెల్యేలందరూ కలిసి ఆయనను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారని తెలిపారు.నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఇప్పుడు చేపడుతున్న పద్ధతికి తాము వ్యతిరేకమని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జనాభా ఆధారంగా పునర్విభజన చేస్తే దక్షిణ భారతదేశం నష్టపోతుందని అన్నారు. దక్షిణ భారతదేశానికి అన్యాయం జరగకూడదనే తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఈ రెండు పార్టీలు కలిసిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై చేస్తున్న విమర్శలకు ఆధారాలు ఉంటే హరీశ్ రావు చూపించాలని డిమాండ్ చేశారు. తాము చర్చకు సిద్ధమని సవాల్ చేశారు.

# తమ మంత్రి కంపెనీలో అవినీతి జరిగిందని ముఖ్యమంత్రే చెప్పారు

**రాఘవ కన్ స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారన్న హరీశ్ రావు**
**ముఖ్యమంత్రి చెప్పింది తప్పని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు చెప్పలేదని ప్రశ్న**
**ఆయన పొంగులేటి కాదని, పొంగు'లూటీ' అని ఎద్దేవా**



తమ మంత్రి కంపెనీలో జరిగిన అవినీతిని తమ అధికారులే గుర్తుపట్టారని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అనుమతులు లేకుండానే నడుపుతున్నారని రాఘవ కన్ స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు. పొంగులేటికి చెందిన ఈ కంపెనీలో అవినీతి జరిగిందని సీఎం చెప్పడం, అధికారులు నోటీసులు ఇవ్వడం తప్పా లేక తన కంపెనీపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు. నాలుగు శాఖలకు చెందిన అధికారులు ఈ కంపెనీకి మూడుసార్లు నోటీసులు ఇచ్చారని తెలిపారు. తన కంపెనీ విషయంలో ముఖ్యమంత్రి తప్పు చెప్పారని సభలోనే పొంగులేటి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఆయన పొంగులేటి కాదని, పొంగు'లూటీ' అని ఎద్దేవా చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారం గురించి మాట్లాడుతూ, రెండున్నరేళ్లుగా ఆ భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. అది ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోకుండా హైడ్రా ఏం చేస్తోందని నిలదీశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్ల పైకి మాత్రమే వెళుతుందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఇంటర్ ఫలితాలపై ఆ వార్తలు నమ్మొద్దు






ఇంటర్ ఫలితాలను ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవమూ లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాల ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని విద్యాశాఖ స్పష్టంచేసింది. ఇంతకుముందు ఎప్పుడూ ఏప్రిల్ మొదటి వారంలో ఇంటర్ ఫలితాలు విడుదల కాలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసింది. అలాగే, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గతేడాది వరకు జరిగిన ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసిన తేదీలను ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ

- మిగతా 2లో...

# ఎమ్మెల్యే పల్లాను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాడు



జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయారు. ఆయన నుంచి ఓ సైబర్ నేరస్థుడు రూ.లక్ష కొట్టేశాడు. ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అంటూ పరిచయం చేసుకున్నాడు. ఓ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యేకు చెప్పాడు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.2500 చెల్లించాలని నమ్మబలికాడు.దీంతో తన నియోజకవర్గంలోని యువతకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సదరు అపరిచిత వ్యక్తికి

ఎమ్మెల్యే పల్లా.. రూ.లక్ష ఫోన్ పే చేశారు. ఆ తర్వాత ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీకి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా? అని అడిగారు. డబ్బులు రాలేదని ఆయన సమాధానం చెప్పడంతోపాటు అసలు తాను ఫోన్ చేయలేదని చెప్పినట్లు తెలిపారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే పల్లా.. జూబ్లీహిల్స్ పీఎస్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీజీ ఐసెట్ అవగాహన..

### కేఎల్ యూనివర్సిటీ మోడల్ ప్రవేశ పరీక్ష..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, ఏప్రిల్ 09,** న హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం విద్యార్థుల కోసం టీజీ ఐసెట్ పరీక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రాముఖ్యతను వివరించినట్లు కళాశాల కెరీర్ గైడెన్స్ ఢ ప్లేస్‌మెంట్ సెల్ ఇంచార్జి డా. దుర్గాప్రసాద్ తెలిపారు. అనంతరం డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సంబంధించిన మోడల్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఉన్నత విద్యపై అవగాహన, కెరీర్ అవకాశాలపై సన్నద్ధతను అంచనా వేసే విధంగా రూపకల్పన చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కేఎల్ యూనివర్సిటీ తమ విద్యా, ప్లేస్‌మెంట్ కార్యక్రమాల్లో భాగంగా ఈ తరహా ఆప్టిట్యూడ్ ఆధారిత పరీక్షలను నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఇంగ్లిష్ విభాగం, కెరీర్ గైడెన్స్ ఢ ప్లేస్‌మెంట్ సెల్, కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, మ్యాథమెటిక్స్ విభాగాల సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్ రెడ్డి, డా. ఎ. దుర్గాప్రసాద్, డా. డి. మక్ల, డా. పి. రమాదేవి, డా. సుబ్రమణ్యం, డా. శారద, ఎన్. బాల, డా. ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవంగర మండల కాంగ్రెస్ నాయకుడికి సన్మానం



**పెద్ద వంగర ప్రతినిధి** గుండెపుడి చైతన్య శర్మ
మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన డాక్టర్ సంకెపెల్లి రవీందర్ రెడ్డి గారిని అవుతాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి గారికి శాలువా కప్పి, అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా అవుతాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మరబోయిన రవి అవుతాపురం ఉప సర్పంచ్ గద్దల పరమేశ్వర్ గార్లు పార్టీ పట్ల రవీందర్ రెడ్డి గారు చేస్తున్న కృషిని గుర్తించి ఈ
పదవిని అప్పగించడం సంతోషదాయకమని, ఆయన నాయకత్వంలో మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అవుతాపురం పార్టీ అధ్యక్షులు బొమ్మెరబోయిన రవి, గ్రామ ఉపసర్పంచ్ గద్దల పరమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీడెండి వీరేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గద్దల యాకస్వామి, గదరాజు రోహిత్ గార్లు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజులు కడితేనే పరీక్షలు... సిద్ధార్థ స్కూల్ యాజమాన్యం దౌర్జన్యం..






**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, ఏప్రిల్ 09, .:**ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బి.ఎన్.రెడ్డి డివిజన్ వైదేహి నగర్ కాలనీలో ఉన్న సిద్ధార్థ స్కూల్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు స్కూల్ వద్దకు చేరుకుని యాజమాన్యాన్ని నిలదీశారు. అయితే, "ఫీజులు కడితేనే ఎగ్జామ్ రాయనిస్తాం... లేదంటే మీ ఇష్టం" అంటూ యాజమాన్యం దురుసుగా స్పందించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకా, విద్యార్థి సంఘ నాయకులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ "మీరు బయట నిలబడి మాట్లాడండి... ఎవరికి ఫోన్ చేస్తున్నారు? ఎమ్మెల్యేకు చేస్తున్నారా? ఫోన్ లిఫ్ట్ చేయట్లేదుగా... నేను మాట్లాడాలా?" అంటూ బెదిరించినట్లు సమాచారం. "మర్యాదగా వెళ్లిపోతారా? లేకపోతే 100కు దయల్ చేస్తాం" అంటూ హెచ్చరించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. "ఎవరు వచ్చినా మాకు సంబంధం లేదు... ఫీజులు కడితేనే పరీక్షలు"

అని యాజమాన్యం తేల్చి చెప్పడంతో తల్లిదండ్రుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. తమ పిల్లల భవిష్యత్తుతో ఇలా ఆడుకోవడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాశాఖలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి, విద్యార్థులను పరీక్షలకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# అక్రమ నిర్మాణానికి అండ ఎవరు?....

**దుండిగల్ సర్కిల్ లో అక్రమార్కులు ఎవరు?:**

**గాగిల్లాపూర్ లో అనుమతి లేకుండా భారీ షెడ్ నిర్మాణం!:**

**చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు!:**




**కుత్బుల్లాపూర్ ఏప్రిల్9 (**
అవినీతి అధికారులపై వేటు పడుతున్నా......అక్రమాలకు పాల్పడుతున్నారనే అభియోగంపై కింది స్థాయి సిబ్బందిని మార్చినా దుండిగల్ సర్కిల్ లో మాత్రం అవినీతి జాడ్యానికి ఇప్పట్లో ఫుల్ స్టాప్ పడేలా కనిపించడం లేదు.నాడు మున్సిపాలిటీ అయినా, నేడు జీహెచ్ఎంసి అయినా దుండిగల్ కార్యాలయంలో అవినీతి మాత్రం చాపకింద నీరులా ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అక్రమ షెడ్ నిర్మాణదారులకు అండగా!....:: దుండిగల్ సర్కిల్ పరిధిలోని గాగిల్లాపూర్ ప్రధాన రహదారిలో ఇండియన్ పెట్రోల్ బంక్ దగ్గర ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ షెడ్ నిర్మిస్తున్నారు.గత కొన్ని రోజులుగా నిరాటంకంగా షెడ్ నిర్మాణ పనులు చేపడుతున్నా దుండిగల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చూసిచూడనట్టుగా వదిలేస్తున్నారు! అధికారులకు ముందుగా ముడుపులు అందాయి కనుకే అక్రమ నిర్మాణమని తెలిసినా ఆ షెడ్ పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇంటర్ ఫలితాలపై ఆ వార్తలు నమ్మొద్దు

- మొదటి పేజి తరువాయి
'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టింది. "ఇంటర్ ఫలితాలు 2014లో మే 3వ తేదీన విడుదల కాగా.. 2015లో ఏప్రిల్ 22న, 2016లో ఏప్రిల్ 22న, 2017లో ఏప్రిల్ 16న, 2018లో ఏప్రిల్ 13న, 2019లో ఏప్రిల్ 18న, 2020లో జూన్ 18న (కొవిడ్ ఎఫెక్ట్‌తో అందరినీ పాస్ చేశారు), 2021లో జూన్ 28న (కొవిడ్ కారణంగా అందరినీ పాస్ చేశారు), 2022లో జూన్ 28న, 2023లో మే 9న, 2024లో ఏప్రిల్ 24న, 2025లో ఏప్రిల్ 22న ప్రకటించారు" అని పేర్కొంది."సమాధాన పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాల ఆధారంగా ఫలితాలను ప్రకటించే తేదీలు ఏటా మారుతుంటాయనే విషయాన్ని గ్రహించాలి. మూల్యాంకనం పూర్తయ్యే సమయం ఆధారంగానే ఫలితాలు విడుదల చేస్తారు. ఇంటర్ ఫలితాల విషయంలో విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మాలి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే తప్పుడు వార్తలను నమ్మొద్దు" అని తెలంగాణ విద్యాశాఖ కోరింది. అలాగే, తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడాన్ని ఆపాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది.

# ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ గ్యాస్‌ను ప్రోత్సహించాలి..

### అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి..



**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 09, .:** ఎల్పీజీ గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ నేచురల్ గ్యాస్ వ్యవస్థను వేగవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో చంద్రా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పైప్‌లైన్ నేచురల్ గ్యాస్ అమలు పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వంట గ్యాస్ వినియోగంలో ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ గ్యాస్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రహదారులు, జాతీయ రహదారులు తదితర ప్రాంతాల్లో పైప్‌లైన్ నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో పైప్‌లైన్ గ్యాస్ వినియోగంపై అవగాహన పెంచేందుకు అధికారులు కృషి చేయాలని, నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో త్వరితగతిన పైప్‌లైన్ గ్యాస్ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రతి శాఖ తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, సివిల్ సప్లయ్ అధికారి వనజాత, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లారీ యజమానుల ఆగ్రహం..




**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, ఏప్రిల్ 09,** :ఆటోనగర్‌లో ఇసుక లారీ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలకు ఫిట్నెస్ సమయంలో రేడియం స్టిక్కరింగ్ ధరలను పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీని తగలబెట్టి నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రవాణా చట్టాల వల్ల లారీ యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారని వారు ఆరోపించారు. ముఖ్యంగా ఫిట్నెస్ రేడియం స్టిక్కరింగ్‌కు పెంచిన ధరలు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానంలో భాగంగా స్టిక్కరింగ్‌ను రవాణా శాఖే ఉచితంగా చేయించాలని డిమాండ్ చేశారు. వాహనదారులు ఇప్పటికే రోడ్డు పన్నులు చెల్లిస్తున్నందున, అదనపు భారాన్ని మోపడం సరికాదని పేర్కొన్నారు. డిమాండ్లను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోతే, భవిష్యత్తులో మరింత ఆందోళనలు చేపడతామని లారీ యజమానులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, లారీ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# కూతురు వివాహానికి మంత్రి సీతక్కను ఆహ్వానించిన బావ్ సింగ్ (గోపాల్)



. మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి హెచ్ పి గ్యాస్ ఏజన్సీ యజమాని భావ్ సింగ్ (గోపాల్ )తన కూతురు జాన్సీ వివాహానికి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కను కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పెళ్లి పత్రికను మంత్రి చేతికి అందజేశారు.ఈ సందర్భంగా సీతక్కను వివాహానికి హాజరు అవ్వాలని కోరారు.ఆహ్వానాన్ని స్వీకరించిన మంత్రి ఆత్మీయంగా పలకరించారు.జాన్సీ వివాహం ఈ నెల 11 తేదీన ఉదయం 11 గంటలకు వేణిగళ్ళ ప్రజా వేదికలో జరుగుతుందనీ మంత్రి కీ తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుమల ప్రభాకర్ రెడ్డి, బానోత్ నాగరాజు,తమ్మిశెట్టి వెంకటపతి,రామచంద్ర పురం సర్పంచ్ వనిత తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన గ్రామ సర్పంచ్.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 8. వలిగొండ మండల కేంద్రంలో దేవిశ్రీ గార్డెన్ ఫంక్షన్ హాలులో..లింగరాజుపల్లి గ్రామానికి చెందిన బొడిగె దేవకమ్మ కుమార్తె రాధిక దంపతులకు పెళ్లి కానుకగా పట్టు వస్త్రాలను గ్రామ సర్పంచ్ బొడిగె లింగస్వామి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు యువకులు పాల్గొన్నారు

## హెల్త్ చో వెరీధర్ హమ్ ఆశ కార్యక్రమం నిర్వహణ.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.మండల పరిధిలోని లచ్చగూడెం అంగన్వాడి 2లో సెంటర్ నందు హెల్త్ చో వెరీధర్ హమ్ ఆశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో... గర్భిణీ స్త్రీల నమోదును,గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మరియు పిల్లల ఎత్తు బరువులను, చూడడం జరిగింది.

కార్యక్రమంలో... హెచ్ఎం సత్యవేణి, హెల్త్ వెరీధర్ చో ఆశ నిర్మల, రత్నకుమారి, అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఆశవర్కర్ రాణి, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండించిన ప్రతి గింజ ప్రభుత్వ కొనుగోలు చేయాలి

- మొక్కజొన్న మార్కెట్ కేంద్రాలు పెంచాలి
- రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్
- చింతకాని ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ మండల నాయకత్వం



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.మొక్కజొన్న రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ చింతకాని బీఆర్ఎస్ మండల నాయకత్వం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.

రైతులు ఎంతో శ్రమించి పండించిన ప్రతి గింజను ప్రభుత్వం తప్పనిసరిగా కొనుగోలు చేయాలని, మొక్కజొన్నకు కనీసం క్వింటాకు రూ. 2600 మద్దతు ధర ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, మధ్యవర్తుల చేతుల్లో మోసపోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

అదేవిధంగా ప్రతి గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల దగ్గర నుంచే పంటను కొనుగోలు చేయాలని కోరారు. ఎకరానికి 26 క్వింటాళ్ల పరిమితి నిబంధనలను ఎత్తివేసి, 40 క్వింటాళ్లకు పైగా పండించిన పంటను కూడా పూర్తిగా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని, మొక్కజొన్న కొనుగోలు కేంద్ర సదుపాయాలు కల్పించి, గ్రామాల్లోనే కొనుగోలు ప్రక్రియను వేగంగా ప్రారంభించాలని నాయకులు కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, వెంటనే స్పష్టమైన చర్యలు తీసుకోవాలని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు నాయకులు మంకెన రమేష్ మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు , పొనుగోటి రత్నాకర్ సర్పంచులు కొండూరి పరిశుద్ధ రావు కోమట్ల గూడెం సర్పంచ్ చేపల మడుగు వీరబాబు తిర్లాపురం సర్పంచ్ రైతుబంధు గ్రామ అధ్యక్షులు మాజీ గడ్డం శ్రీనివాసరావు నన్న క కోటయ్య ఆకుల చంద్రయ్య పిన్నెల్లి శ్రీనివాసరావు యువజన అధ్యక్షులు నేరద గ్రామ అధ్యక్షులు చెవుల వెంకటప్రసాద్ నర్సింపురం అధ్యక్షులు నన్నక నరసరావు నన్నక గోవిందరావు మాజీ సర్పంచ్ నామవరం కొండలు గాంధీనగర్ అధ్యక్షుడు కొండలు బసాపురం మాజీ సర్పంచి సోమా నాగేశ్వరావు పలనీడి కొండలు చింతకాని పిఎస్సీ మాజీ డైరెక్టర్ అంజయ్య చింతకాని మత్స్యకార సంఘం అధ్యక్షులు జరగబోయన కృష్ణ , బంధం చిన్నకృష్ణ తిర్నాపురం ఉప సర్పంచ్ గోగు నరసరావు యువజన నాయకులు కొప్పూరు నవీన్ ఎస్.కె మేరా సాబ్ ఆదినారాయణ అల్లిక నరేష్

## శ్రీ దత్త సాయి సన్నిధిలో మూలా నక్షత్ర పూజలు
## భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం..
## జయ జయ సాయి ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ

ప్రతినిధి.పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ శ్రీ దత్త సాయి అన్నదాన సమాజం మరియు జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో.. గురువారం రోజు సప్తమి మూలా నక్షత్రం సందర్భంగా మూలా నక్షత్ర పూజలు ప్రత్యేకంగా శ్రీ దత్త సాయి సన్నిధిలో జరిగినాయి, శ్రీ దత్త సాయి కి వేదమంత్రాలతో అభిషేక పూజా కార్యక్రమం, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ దత్త సాయికి అష్టోత్తర శతనామ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జగదీష్ దుర్గ దంపతుల ఆర్థిక సహాయ సహకారాలతో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది అనంతరం ట్రస్టు నిర్వాహకులు పూసపాటి బాలాజీ మాట్లాడుతూ.. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్ని జీవులలో ఆకలి రూపంలో పరమాత్ముడు ఉన్నాడని ఒకరికి అన్నం పెట్టి ఆకలి తీరిస్తే పరమాత్మ తృప్తి చెంది సకల శుభాలను ఇస్తాడని అందులో ముఖ్యంగా సద్గురు సన్నిధిలో చేస్తే అన్న సంతర్పణ మరింత శక్తివంతమైనదని, దత్త సాయి సన్నిధిలో అన్నసంతపని చేసిన వారికి గురు బలం లభించి వివాహాలు సంతానం కార్యసిద్ధి జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు కొత్తూరు హనుమంతరావు అయినవోలు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏన్కూరులో ప్రైవేటు సీడ్ మొక్కజొన్న కొనుగోళ్లలో గందరగోళం

- లారీలు లేవంటూ ఆలస్యం... రైతులను వేధిస్తున్న కంపెనీ ఏజెంట్లు
- బస్తాకు రూ.10 ఎగుమతి ఖర్చు -- "మా ఇష్టం" అంటున్న ఏజెంట్లు
- ఆరు కాలాలపాటు కష్టపడి పండించిన పంటకు న్యాయం ఎక్కడ? -- ప్రైవేటు సీడ్ మొక్కజొన్న రైతుల ఆవేదన





సికే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు ఏప్రిల్ 09 2026: ఆరు కాలాలపాటు ఎండలు, వానలు తట్టుకుని రాత్రింబవళ్లు శ్రమించి పండించిన మొక్కజొన్న పంటకు సరైన న్యాయం దక్కడం లేదని ఏన్కూరు మండలంలోని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని సీడ్ మొక్కజొన్న సాగు చేసిన రైతులు, కొనుగోలు దశలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చేనుల నుంచి మొక్కజొన్నను విరిచి ఎండబెట్టి సిద్ధం చేసినప్పటికీ, కంపెనీలు సమయానికి పంటను తీసుకెళ్లడం లేదని రైతులు చెబుతున్నారు. నాలుగు నుంచి ఐదు రోజుల పాటు కూడా లారీలు రాకపోవడంతో పంట వే బ్రిడ్జి కాటాల వద్దే నిల్వ ఉండిపోతోంది. దీంతో రైతులు అక్కడే కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ముఖ్యంగా, కొందరు రైతులకు మొక్కజొన్నను సంచుల్లో నింపేందుకు అవసరమైన గన్నీ సంచులు కూడా కంపెనీలు ఇవ్వడం లేదని తీవ్రంగా ఆరోపిస్తున్నారు. సంచులు ఇవ్వకపోవడంతో పంటను చేనులోనే ఉంచాల్సి వస్తోందని, దీనివల్ల ఎండ, గాలి, వర్షం ప్రభావంతో పంట నాణ్యత తూకం తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెంట్లను బతిమిలాడినా కూడా స్పందించకుండా, "మీరు ఖమ్మం వెళ్లి మీ సొంత ఖర్చుతో సంచులు తెచ్చుకోండి" అని చెప్పడం రైతులను మరింత ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోతున్నారు. ఇప్పటికే పంట సాగులో భారీ ఖర్చులు చేసిన రైతులు, ఇప్పుడు అదనంగా సంచుల కోసం కూడా ఖర్చు పెట్టాల్సి రావడం ఆర్థికంగా భారమవుతోంది.

ఇంకా, సాధారణంగా కాటా వేసి పక్కన దింపాల్సిన మొక్కజొన్నను ఆ విధంగా స్వీకరించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. లారీలు లేవని చెప్పి ఆలస్యం చేస్తూ, లారీలు వచ్చిన తర్వాత మాత్రం ట్రాక్టర్ల నుంచి నేరుగా లారీలకు లోడ్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. దీంతో రైతులు అదనపు కూలీలను పెట్టుకోవాల్సి వస్తూ ఖర్చులు పెరుగుతున్నాయి.

అంతేకాకుండా, బస్తాకు పది రూపాయలు ఎగుమతి ఖర్చుల పేరుతో కూడా రైతులపై భారం మోపుతున్నారని రైతులు వాపోతున్నారు. గతంలో ఎటువంటి ఎగుమతి ఖర్చులు లేకపోయినా, ఇప్పుడు కొత్తగా ఈ విధంగా డబ్బులు వసూలు చేయడం అన్యాయమని వారు అంటున్నారు. ఇది రైతుల ఆదాయాన్ని మరింత తగ్గిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమస్యలపై ప్రశ్నిస్తే, "మా నియమాలు ఇవే" అంటూ ఏజెంట్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులు గట్టిగా మాట్లాడితే తమకు రావాల్సిన చెల్లింపులు ఆలస్యమవుతాయో లేక ఇవ్వకపోతారోనన్న భయంతో మౌనం వహిస్తున్నారు.

మరోవైపు, ట్రాక్టర్ల నుంచి నేరుగా లారీలు లోడ్ చేయించడం వల్ల గ్రామీణ రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

ఆరు కాలాలపాటు కష్టపడి పండించిన పంటకు ఈ విధంగా ఇబ్బందులు ఎదురవుతుండటంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రైవేటు సీడ్ కంపెనీలపై చర్యలు తీసుకుని, కొనుగోలు ప్రక్రియను సక్రమంగా నిర్వహించేలా చూడాలని, రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## తాటి చెట్టు పై నుండి క్రింద పడిన గీత కార్మికుడు.


సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 8.యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సుంకిశాల గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొమ్మగాని ఐలయ్య గౌడ్ (పెద్ద గౌడ్ ) సమయం సాయంత్రం 4:00గంటల సమయం లో తాటి చెట్టు పై నుంచి ప్రమాదవ శత్తు కిందపడి గాయాలు అయినవీ హుటా హుటి గ్రామస్థులు అతనిని చికిత్స నిమిత్తం 108 కి సమాచారం చేరవెయ్యడం తో అతనిని హైదరాబాద్ కి తరలించినరు ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు.







## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం (మార్క్ఫెడ్)ను ప్రారంభించిన మాజీ జెడ్పిటిసిడ ఆత్మ కమిటీ డైరెక్టర్ కూరపాటి శిరీష.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు. మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలోని . మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను కూరపాటి శిరీష ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మద్దతు ధర 2400/- రూపాయలు ఇస్తుందని మొక్కజొన్న రైతులందరూ మార్క్ ఫెడ్ ద్వారా అమ్మకాలు..చేయాలని,దళారుచేతుల్లో... మోసపోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో

చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, ఆత్మ కమిటీ చేర్మెన్ తుమ్మలూరు ముత్తయ్య,వార్డు సభ్యులు కూరపాటి నరసరావు, పోనాటి సుజాత,ఉన్న మల్లయ్య, పోనాటి పెద్ద కృష్ణారావు, తుడుం ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు పెంట్యాల రామారావు, గ్రామ కాంగ్రెస్ నాయకులు,తదితరులు,పాల్గొన్నారు.

## నేరడలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం..



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం నేరడ గ్రామంలో ప్రారంభించారు. సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సంకల్పంతో ప్రభుత్వ ఏర్పాటు చేసిందని సిపిఐ మండల కార్యదర్శి దుసరి గోపాలరావు గ్రామ ఉప సర్పంచ్ కోట బాలేష్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మంకెన నాగేశ్వరరావు లు తెలిపారు. వారు మాట్లాడుతూ రైతులకి గిట్టుబాటు ధర కల్పిస్తూ ఒక్కొక్క కింటాకి 2400 రూపాయలు మద్దతు ధరలు చెల్లిస్తూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి రైతులు అభినందనలు ఉన్నారని వారన్నారు కౌలు రైతులకు కూడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా పట్టాదారు పాస్ పుస్తకం అకౌంట్ జత చేసి అందించిన మొక్కజొన్న ధాన్యాన్ని అమ్ముకోవచ్చని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆలస్యం వెంకయ్య పెరిక నందు, నున్న నాగయ్య, వంకాయలపాటి మాధవరావు, ఆలస్యం బుచ్చిబాబు, రాగం లింగరాజు, గోగుల ఆదినారాయణ పులిపాటి లక్ష్మీపతి, ఆలస్యం గోవిందరావు,

## దాహార్తి తీర్చేందుకు అంబలి కేంద్రం ఏర్పాటు



సికే న్యూస్ ప్రతినిధి వనపర్తి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సౌజన్యంతో అంబలి కేంద్రం, చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు

గురువారం వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఈ అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు

మండుతున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని వివిధ పనుల నిమిత్తం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఈ అంబలి కేంద్రం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు

ఇట్టి అంబలి కేంద్రాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు

కార్యక్రమంలో వనపర్తి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల తిరుపతయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మాజీ కౌన్సిలర్లు బ్రహ్మం చారి, కదిలే రాములు, క్యాంపు కార్యాలయం సిబ్బంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఏర్పుల మల్లయ్య దశదినకర్మ లో పాల్గొన్న ప్రముఖ నాయకులు రాజకీయ నాయకులు.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 8.వలిగొండ మండల పరిధిలోని వేములకొండ గ్రామానికి చెందిన ఏర్పుల మల్లయ్య (80) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు ఆయన దశదినకర్మను బుధవారం వేములకొండలోని ఆయన స్వగృహంలో వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో వారి కుమారులు ఏర్పుల లింగయ్య ఏర్పుల వెంకటేశం ఏర్పుల యాదయ్య ఆయన కూతుర్లు అల్లుళ్లు వారి మనవళ్లు మనవరాలు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**పనులు వేగవంతం చేయాలి -- అధికారులకు ఆదేశాలు.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09,**కొత్తగూడెంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. కొత్తగూడెంలో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం కేటాయించిన స్థలంలో జరుగుతున్న పనులను సమగ్రంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రాంగణంలో జరుగుతున్న లెవెలింగ్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ ద్వారా భవనాల రూపకల్పన, విభాగాల వారీగా ఏర్పాటు చేయనున్న సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అందించనున్న తరగతి గదులు, లైబ్రరీలు, బ్లాక్ రహదారులు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై వివరాలు తెలుసుకున్నారు...

నిర్మాణ పనులు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి అయ్యేలా వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్ర సామగ్రి ఏర్పాటు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

నిర్మాణ పనుల పురోగతిపై ప్రతిరోజూ నివేదికలు




అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అత్యుత్తమ సౌకర్యాలతో పాఠశాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు

సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొ. జయశంకర్ బడి బాట కార్యక్రమం విజయవంతంగా ప్రారంభం




**సి కె న్యూస్ ఆత్మకూరు యం రిపోర్టర్ షేక్ అజీజ్ :**పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆత్మకూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొ. జయశంకర్ బడి బాట కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

ఈ సందర్భంగా ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ శ్రీమతి బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ గారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు, నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి చదివించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజనం మరియు ఇతర సదుపాయాలు విద్యార్థులకు అందుతున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో , వీజూా కే. మహాదేవ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్ గ్రామ కార్యదర్శి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, ఎతీం జిల్లా నాయకులు కోరే బిక్షపతి, బిల్ కలెక్టర్ సుదర్శన్ కారోబార్ కిష్టయ్య,మల్గా క్రాంతి గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఆర్డీఓ జయ చంద్రరెడ్డి



**ఏప్రిల్ 12 (సీ కే న్యూస్) చేగుంట:**చేగుంట మండల్ తహసిల్దార్ కార్యాలయంలో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ శివప్రసాద్ అన్నారు. చేగుంట మండల తహసిల్దార్ కార్యాలయంలో గురువారం తూప్రాన్ ఆర్డీఓ జయచంద్ర రెడ్డి తాసిల్దార్ కార్యాలయం చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యాలయానికి వచ్చే,వెళ్లే ప్రజల కొరకు చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని . వేసవిలో తీవ్ర ఎండలు ఉండడంతో దూర ప్రాంతాల నుండి వచ్చే వారికి

కార్యాలయంలోనే చలివేంద్రం ఏర్పాటు చేయడం

జరిగిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శివ ప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జై భరత్ రెడ్డి,,సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ , సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా చీూఖX ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**సి కె న్యూస్ రిపోర్టర్ షేక్ అజీజ్ ఆత్మకూరు యం :** ఆత్మకూర్ ఎం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద చీూఖ× 56వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ కార్యాలయం ఎదురుగా చీూఖ× జెండాను మండల అధ్యక్షుడు యాస సుభాష్ రెడ్డి గారు ఆవిష్కరించారు. ఇట్టి కార్యక్రమంలో ఎన్ ఎస్ ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్ గౌడ్ పట్టణ అధ్యక్షుడు లోడి మహేష్ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి గారు మాజీ జెడ్పిటిసి కోడిత్యాల నరేందర్ గుప్తా గారు ఏసిఎస్ మాజీ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి గారు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు గౌడ్ ప్రధాన కార్యదర్శి కందడి అనంతరెడ్డి ఓబీసీ సెల్ బత్తిని ఉప్పలయ్య పట్టణ శాఖ అధ్యక్షుడు పోతగాని మల్లేష్ గౌడ్ స్థానిక మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్, మాజీ ఎంపీటీసీ దిగోజు నరసింహ చారి రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పైళ్ల దామోదర్ రెడ్డి, మాజీ ్రూజూ మాజీ డైరెక్టర్ నోముల వెంకటరెడ్డి,వార్డు సభ్యులు ఎలాగందుల సైదులు బూడిద శేఖర్ గౌడ్ కూరెళ్ల అనిల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఎద్దు వెంకన్న గ్రామశాఖ ఉపాధక్షులు ఉగ్గే నరేష్ ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఎలాగందుల మహేష్ నాయకులు రంగ స్వామి దొంతరబోయిన భాస్కర్ కొండపల్లి ముత్యాలు,గట్టు శేఖర్ మజీద్ చీూఖ× నాయకులు పైళ్ల మహేష్ చేపూరి సోమేశ్వర సాయి కందడి మధు ఎలగందుల సాయి లక్ష్మణ్ ది గోజు భరత్ ఉగ్గే ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు

# గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా రైతుల దీక్ష విరమణ





**సికె న్యూస్ వనపర్తి జిల్లా ప్రతినిధి** ఏదుల మండలం పరిధిలోని గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న రైతులతో మాజీ మంత్రి హరీష్ రావు చర్చించి, వారి దీక్షను విరమింపజేశారు.

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, ఇది రాజకీయాల కోసం చేసే దీక్ష కాదని, రైతుల హక్కుల కోసం జరుగుతున్న పోరాటమని తెలిపారు. గతంలో అరవై ఏళ్లలో కేవలం 25 రిజర్వాయర్లు మాత్రమే నిర్మించగా, బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది ఏళ్లలో 65 టీఎంసీల సామర్థ్యంతో అనేక ప్రాజెక్టులు పూర్తి చేసిందని అన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో ముఖ్యమైన భాగాన్ని తమ ప్రభుత్వం పూర్తి చేసిందని, ప్రస్తుతం చిన్న పనులు కూడా పూర్తి చేయలేకపోతున్నారని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మూడు సీజన్లు వృథా కావడంతో సుమారు 50 టీఎంసీల నీరు నిల్వ చేసే అవకాశం కోల్పోయామని అన్నారు.

గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ అవసరం లేదని, ఏదుల నుంచే నీరు పారే పరిస్థితి ఉందని ముందుగానే చెప్పామని తెలిపారు. కమీషన్ల కోసం ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకురావడం సరికాదని హెచ్చరించారు.

పాలమూరు ప్రాంత అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని, వలసలు తగ్గి, ప్రాంతం పచ్చని రంగు దాల్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.

రుణమాఫీ 100 శాతం పూర్తయితే తాను రాజీనామా చేయడానికి సిద్ధమని, కాకపోతే ప్రభుత్వ నాయకులు కూడా బాధ్యత వహించాలని సవాల్ విసిరారు. రైతుల భూములను కాపాడేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

శ్రీనివాస్ గౌడ్ విమర్శలు

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, రెండున్నర ఏళ్లుగా మోటార్లు సక్రమంగా నడపడం లేదని, వట్టేం పంపులు మునిగినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ ఘటనలో కూడా నిర్లక్ష్యం చూపించారని అన్నారు. కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలనుకుంటున్నారని విమర్శించారు.

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలు

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోలేదని, దానిని కావాలనే కూల్చివేశారని ఆరోపించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిది





**మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సర్పంచ్ జువ్వి నరసింహ**

**సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్) ఏప్రిల్ 9:**చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామానికి చెందిన జంగం సత్తమ్మ, ముటుకులోజు శ్రీనివాస చారి కి మునుగోడు అభివృద్ధి ప్రదాత శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ జువ్వి నరసింహ సమక్షంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య, జువ్వి నరసింహ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిదని అన్నారు. ప్రభుత్వ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కొంతం బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐతరాజు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బస్వాపుర లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ ఆవులు నరసింహారావు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం బస్వా పురం గ్రామంలో ప్రారంభించారు. సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సంకల్పంతో ప్రభుత్వ ఏర్పాటు చేసిందని గ్రామ సర్పంచ్ ఆవుల నరసింహారావు వారు మాట్లాడుతూ రైతులకి గిట్టుబాటు ధర కల్పిస్తూ ఒక్కొక్క కింటాకి 2400 రూపాయలు మద్దతు ధరలు చెల్లిస్తూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి రైతులు అభినందనలు ఉన్నారని వారన్నారు కౌలు రైతులకు కూడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా పట్టాదారు పాస్ పుస్తకం అకౌంట్ జత చేసి అందించిన మొక్కజొన్న ధాన్యాన్ని అమ్ముకోవచ్చని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు

## రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే..
## కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలకు విసిగి వేసారిన ప్రజలు..

ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్...

ఏప్రిల్ 19న ఖమ్మంలో మినీ ప్లీనరి..హాజరుకానున్న తన్నీరు హరీష్ రావు..

ఖమ్మం నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నివాసంలో జరిగింది.

ఈ సమావేశంలో పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ దాటికి తట్టుకోలేక అధికార పార్టీ సస్పెండ్ చేసే స్థాయికి దిగజారిందని ఏద్దేవా చేశారు.

కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారంటీలు హామీలు నెరవేర్చలేక బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను తమ పనులుగా చూపించుకుంటూ ప్రజలను మభ్య పెడుతున్నారు.

గత ఎన్నికల్లో వ్యక్తిత్వ హననం చేసి రెండు మూడు రోజులు ముందుగా వచ్చి అధికారం లోకి వచ్చారు.కేసీఆర్ గారి మీద నా మీద చెడు ప్రచారం చేసి పబ్బం గడుపుకున్నారు నిజం నవాబ్ కాలంలో ఖాసీం రిజ్వి లాగా పాలించారు అన్నారు.ఇప్పుడు వెలుగుమట్లను గాజాగా చేశారని దుయ్యబట్టారు.

మట్టి గుట్టలు అమ్ముకున్నాడని ఎన్నో నిందలు వేశారు మరి ఇప్పటి వరకు ఏమి నిరూపించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గుట్టలన్ని మాయం అయ్యాయి దానికి ఏమి సమాధానం చెపుతారు అని డిమాండ్ చేసారు.

మన రాష్ట్రంలో చేసింది ఏమి లేదు కేరళ వెళ్ళి నేను మీకు అండగా ఉంటా అన్న రేవంత్ రెడ్డికి కేరళ సీఎం పినరాయి విజయన్ గట్టి బుద్ధి చెప్పారు. మన ఖమ్మం వెలుగుమట్ల ఇళ్ళు కూల్చడం దారుణం అని విజయన్ ట్విట్టర్ లో కూడా పోస్ట్ చేశారు.

1/70 లో ఉన్న భూములు కూడా మంత్రులు ఎలా కొనుకొన్నారు.

హైదరాబాద్ చుట్టూ భూములు ఆక్రమించుకుంటూ పేదలను పెద్దవారిని ఎవరిని వదలకుండా రౌడీలతో బెదిరిస్తున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర ఏళ్ళు అయింది వచ్చి ఒరగబెట్టింది ఏమి ప్రజలకు అర్థం అయింది..వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే..అని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు.

కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు,మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ జీ సి కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్,టేకులపల్లి మాజీ సొసైటీ అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి,

కార్పొరేటర్ మక్బుల్,దండా జ్యోతిరెడ్డి,పల్లా రోజ్లీనా,కూరాకుల వలరాజు,బుర్రి వెంకటేశ్వర్లు, మాటేటి నాగేశ్వరరావు, శీలంశెట్టి వీరభద్రం,మండల అధ్యక్షుడు వీరు నాయక్,మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిన్ని కోటేశ్వరరావు,

మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి,పోట్ల శ్రీకాంత్,సిరిపురపు సుదర్శన్,ఎర్రా అప్పారావు,కోప్పర నరసింహారావు,వల్లభనేని రామారావు,నగర మైనారిటీ అధ్యక్షుడు షంసుద్దీన్,ప్రచార కార్యదర్శి షకీనా,సర్పంచ్ కొంటెముక్కల వెంకటేశ్వర్లు, పెంట్యా,మూర్తి,మాటేటి కిరణ్,ధనలక్ష్మి, మాజీ సర్పంచ్లు,మాజీ ఎంపిటిసిలు నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.